# కూతురు పెళ్లి

కూతురుపెళ్లి కావాలి! పెళ్లి కావాలంటే ఎంతో కట్నం కావాలి! ఎంత కట్నానికయినా రాఘవయ్య రాజమ్మలు బీదవాళ్లు. అయిదేళ్ళకిందట పెళ్లి కావలసిన కూతురు యింకా అట్టానే వుంది! వూళ్లో అందరూ అదే అంటున్నారు. ఓ భగవంతుడా!

అప్పటికీ కూతురు పెళ్లి విషయమై రాఘవయ్య చెవులో పిండిమర పని చేస్తున్నట్టు పనిచేస్తూనే వుంది రాజమ్మ. రాజమ్మకు కూతురు దొడ్డో తోటకూర మొక్క పెరిగినట్టుగా పెరుగుతున్నట్టు కనిపిస్తున్నది. ఏదోవిధంగా ఎందరికో పెళ్లిళ్లవుతున్నయి — మరి దీనికి కాదేం?

కూతురు కుందేలుపిల్లకుమల్లే యింటో తిరుగుతున్నది—బెదురుచూపుల్తో.

* * *

"అయ్యో అదేంటండీ పిల్లవాడు నిక్షేపంగా వుంటేనూ!"

"చూస్తే ప్రయోజకుడల్లేనే వుంది! చూడంగానే అమ్మాయిని చేసుకుంటా నన్నాడు!"

"బియ్యే చదువుకున్నాట్ట!"

"యీ జీవితానికి యిదొక గండం తప్పింది కట్నం లేకుండా!"

"దానికా అదృష్టరేఖ వుందిగాని పదివేలిచ్చినా దొరకదీ సంబంధం!"

"చిన్నవాడే!"

"అబ్బే మొన్న ఫాల్గుణ మాసానికి పాతిక నిండినయిటండీ!"

"అబ్బే మరీ అంతగాదుగానీ—ముప్పయ్యన్నా వుండచ్చు."

"మీదంతా మరీ విచిత్రం—వాళ్ళకేం ఖర్మపట్టిందీ అపద్ధం చెప్పటానికీ? రైలుప్రయాణంకాదూ పాపం– కొంచెం నలిగినట్టుంది."

"అంతేగావాలున్నగానీ–మరి కొంచెం నల్లటివాడే."

"ఆc, అందం కోసుకుతింటారా ఏం మరీ మీరంతా– మీరు మహా పచ్చటి వారు– నాకు గడవలేదా ఏం?"

"సరే నీ సుఖం నేనేం ఎరుగుదును. మొదట్లో నువు ఏడ్చావుట్లే నాకు తరువాత తెలిసింది"

"ఛీ పాడూ– చిన్నతనం– అప్పుడేమనిపించిందో! మా చక్కగా వుంటుంది అలవాటు పడ్తే."

"రంగు సంగతంత ముఖ్యం కాదనుకో— కాస్త ఏవో బైటతిరగటాలు వున్నయ్యని విన్నాను— నిజా నిజాలు మనకేం తెలియదనుకో !"

"ఇదిగో యిట్టా నోరుపడేసుకు చస్తారు కాస్త మంచి సంబంధం దొరికిందంటే ! అయినా ఆ మొదట చేసుకున్న పెళ్లాం పిచ్చిముండై చస్తే యీడొచ్చిన మొగవాళ్లేం కుదిగట్టుకుంటారా ఏమిటండీ. ధీ పాడు, లేనిపోని పాపం మనం అంటగట్టటం దేనికి నిక్షేపంలాంటి పిల్లవాణ్ణి కాస్తా పట్టుకుని !"

"ఇంతకూ ఎవరి అదృష్టాన్ని గురించీ మన మిప్పుడేం నిర్ణయించలేం అనుకో— అయినా వాడూ ఒక పదివేల కట్నం యివ్వగల తాహతుంటే—ఆ పద్ధతే వేరు."

"అయ్యో! అయ్యో! యిర వైవేల ఆస్తిపరుడు — కళ్లుమూసుకుని పదిహేను వేలిచ్చి ఎగరేసుకెళ్తారు ! ఏదో వర ప్రసాదంలాగా మనింటి ముందరకొచ్చి అడుగుతున్నాడు— ఎంత బుద్ధిమంతుడు-యింతలోనే మర్చిపోయినావ్టండీ యీ అయిదేళ్ళ నుంచీ మనం తలకాయ దాచుకున్న దాచుకోటం— యీ దరిద్రంలో— అబ్బ— ఎంత అదృష్టం, ఎంత అదృష్టం!"

"కాదుటే మరీ— నా తల తాకట్టు పెట్టినా ఒక్క దమ్మిడీ అంటే ఒక్క దమ్మిడీ యిచ్చే దీపిలేడు యీ ప్రపంచంలో."

"మరి అదిగాదూ నేను మొత్తుకునేదీ !"

"పాపం చిన్నముండ అదేం అనుకుంటున్నదో !"

"కానేవుంది ! పెళ్ళంటే ఎవరికన్నా యిష్టంగానే వుంటుంది—మాచక్కా—"

"పాపం యీ నాలుగయిదేళ్ళనుంచీ మన కీచులాటలో దానికి పెళ్లికాదని భయం కలుగజేశాం గదా !"

"దానికేం లేవా భయాలు— మీకున్నట్టుంది అటే చూస్తే."

"నా కెంతుకేవ్ భయం— యింతకూ దాని పెళ్లిగదా అనిగాని—"

"దాని పెళ్లి కాటోతే యిహ మీ పెళ్ళీ నాపెళ్ళీనా ఏమిటి యిదంతా ! ఏదో యింత లోకానుభవం వుందిగనుక యిట్టా ఏడుస్తాంగాని—చిన్నకుంక దానికేందెల్సు అతం సుతం !"

"వంధొమ్మిదేళ్లన్నయిగానీ—చివర కంతేలే—"

"అనుభవాల్లేంది ఎప్పుడూ అంతే."

"అవునుగానీ— మన పెళ్లప్పుడు నువేమనుకున్నావే?"

"మీకేమన్నా పుట్టిందా ఏం—చాల్లెండి సరసం."

"వుహుఁ మన్లోమాట– ఎందుకో అనిపించిందిలేవే– నేనెట్టా కనుపించాను నీకూ ?"

"ఛీ పాడూ–"

"ఛీ పాడూ ! ఎన్నేళ్లయినాక అడుగుతున్నానే ?"

"వూఁ– పోనిద్దురూ-"

"ఇదిగో యింతే కాదూ-"

"అప్పు డెందుకో మీరు– డోకొచ్చారండీ–"

"ఛా–!"

"అదేమిటో– అట్టా అనిపించిందండీ–"

"మరెందుకు చేసుకున్నావే ?"

"మా అమ్మమ్మ చంపుతానంది– బావిలోపడి చస్తానంది వెధవ– పాపం ఎక్కడుందో చచ్చి !"

"పెద్దముండల్తో ఆదే చావు–"

"అసలు మా అమ్మమ్మ సంగతి మీకు తెలియదుగానీ–వుత్త పాచిముండ– ఛీ పాపం పెద్దముండ !"

"అయితే నువు నన్ను బలవంతాన చేసుకున్నావన్నమాట !"

"అబ్బే అదేం మాటలండీ– నేను తరవాత ఒప్పుకున్నాగా."

"అదే బలవంతమ్మీద-?"

"ఛా ఛా !"

"మరి చేసుకోనని ఏడ్వావుటగాదుటే ?"

"చిన్నతనం కాదుటండీ– అలవాటయినాక అంతా బాగానే వుంది– అబ్బ పోనిద్దురూ !"

"నువు భలే దొంగవే !"

"చాల్లే వూరుకోండి-సరసం బాగానే వుంది !"

"నిజంగా పెళ్లంటే మాటలా !"

"ఎంతో అదృష్టం వుండాలి– మరి మీకీ సంబంధం నచ్చిందండీ ?"

"నీకో ?"

"చాల్లెండి మరీ–నాకు భలే నచ్చిందండీ."

"నాకూ అంతే–తథాస్తు."

('ఆంధ్రజ్యోతి' మాసపత్రికలో)